క్లుప్తంగా

223 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజులమ్మ

గంగవరం : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆముదాలబంద సర్పంచ్ పాయం రాజులమ్మ అన్నారు. కుసుమరాయిలో శుక్రవారం నిర్వహించిన పశు వైద శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో 223 పశువులకు జబ్బ వాపు వ్యాధి నిరోధక టీకాలు, కోళ్ల, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్లు లైవ్ స్టాక్ అసిస్టెంట్ యరబాల రాజు తెలిపారు. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు పి.నాగేశ్వరరావు, కీర్తన, షేక్ బషీర్ బీబీ , వేంకటేశ్వర్లు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎటపాక: మండలంలోని గుండాల గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, సర్పంచ్‌లు సీతాలక్ష్మి,ఆదినారాయణ పరిశీలించారు. పనుల నాణ్యత వివరాలు కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీ పడవద్దని, నిర్మాణపనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

క్రీడలతో స్నేహభావం వృద్ధి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఏటీడబ్ల్యూవో హాసిని

అడ్డతీగల: క్రీడాపోటీల వల్ల స్నేహభావం వృద్ధి చెందుతుందని, విద్యార్థిదశ నుంచి క్రీడల్లో ప్రావీణ్యాన్ని వెలికితీయడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని అడ్డతీగల సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎం.హాసిని అన్నారు. మండలస్థాయి క్రీడా పోటీలను స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగాజరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రీడలవల్ల దేహదారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. ఎస్ఐ అప్పలరాజు మాట్లాడుతూ క్రీడల వల్ల పోటీతత్వం అలవడుతుందన్నారు. ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడు తూ మండల వ్యాప్తంగా 14పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

మారేడుమిల్లి : పాముకాటు వేయడంతో శుక్రవారం ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మండలంలోని పుల్లంగి పంచాయతీ పరిధిలోని గుడిస గ్రామానికి చెందిన సాదల కొమ్మిరెడ్డి తన గ్రామం నుంచి ఆకుమామిడికోట గ్రామానికి సంతకు నడుచుకుని వెళుతుండగా మార్గ మధ్యంలో పాము కాటు వేసింది. గమనించి ఆయనతో పాటు సంతకు వస్తున్న గిరిజనులు 108 వాహనంలో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవలు కోసం రాజమహేంద్రవరం తరలించారు.

రగ్గుల పంపిణీ



బాలరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

అరకులోయ రూరల్: నేచర్ సంస్థ వ్యవస్థాపకుడు దివంగత ఎస్.బి. బాలరాజు వర్ధంతి సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ వికాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించి, 50 మందికి రగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేచర్ సంస్థ ప్రతినిధులు గౌరీపట్నాయక్, సంతోష్,చలం,కృష్ణ,అద్దు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అరడకోటలో బీపీ చెకప్ చేయించుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



దుంబ్రిగుడలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ప్రేమ, చిత్రంలో ఎంపీపీ ఈశ్వరి



గంగవరంలో జగనన్న సురక్ష సర్వేలో సూచనలు ఇస్తున్న వైద్యాధికారి భావన

పెదబయలు: రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, దీనిలో భాగంగా ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. అరడకోట ఉప ఆరోగ్య కేంద్రం పరిధిలోని అరడకోట కాలనీలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది,గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబంలో అందరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అనారోగ్యంగా ఉన్న వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే

జగనన్న సురక్ష కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బీపీ, మధుమేహం పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వంతాల ఆనందరావు, వైస్ ఎంపీపీ రాజుబాబు. వైద్యాధికారి జి.నిఖిల్, జిల్లా వాణిజ్య విభాగం జిల్లా నాయకులు ఓ.సామ్యుల్, ఎంఎల్‌హెచ్‌పీ రేగం శివ,సర్పంచ్ రూడ మత్స్యలింగం,నాయకులు సూరయ్య,కనకరాజు,వెంకయ్య, సన్యాసిరావు,అనంతరావు, వైద్య సిబ్బంది నర్సింగమూర్తి,రత్నాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని దుంబ్రిగుడ మండల కేంద్రంలో శుక్రవారం దుంబ్రిగుడ ఎంపీపీ బాక ఈశ్వరి,జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా దుంబ్రిగుడ వైద్యాధికారి ప్రేమ ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు,తహసీల్దార్ నాగమ్మ,ఎంపీడీవో ఉషారాణి,మండ పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే ప్రారంభం

గంగవరం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి భావన అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పాతగంగవరం శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి భావన పరిశీలించి వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని పరిశీలించి రోగుల వివరాలు సేకరించాలన్నారు. ఆమె వెంట పీహెచ్ఎన్ విజయలక్ష్మి, ఏఎన్ఎం మేరి, శుభలక్ష్మి, కుందన , మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ అనంత బాబు



పీరుకొండ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు



రాజవరం- దోనెలపల్లి బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

గంగవరం : జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) అన్నారు. మండలంలోని రాజవరం నుంచి దోనెలపల్లి వరకు రూ.రెండు కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన దోనెలపల్లిలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. మండలంలోని ఎండపల్లి- గంగవరం , రాజవరం- దోనెలపల్లి రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ నిధులు రూ.ఐదు కోట్లు మంజూరైనట్టు తెలిపారు. గతంలో మొల్లేరు నుంచి అర్ధీపురం వరకు బీటీ రోడ్డు అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాజవరం అగ్ని బాధితులకు సాయం అందిస్తాం

రాజవరం అగ్ని బాధితులు ఎమ్మెల్సీ అనంత బాబును కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.ఈ సందర్భంగా దోనెలపల్లి , రాజవరం గ్రామాలకు చెందిన గిరిజనులు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ కె.గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కె.పద్మావతి, సర్పంచ్‌లు శివదొర, సుబ్బలక్ష్మి, లీలావతి, రామలక్ష్మి, కె.లక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జువెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ సిద్ధార్థ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పావని,మహిళా నాయకులు కె.సత్యవతి, వైఎస్సార్ సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, సమన్వయకర్త బి.నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అప్పలరాజు పాల్గొన్నారు.

రంపచోడవరం: మారుమూల గ్రామాలకు పక్కా రోడ్డు సదుపాయం కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. రంపచోడవరం మండలంలో పీరుకొండ నుంచి తిరగటిరాళ్లు వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు, చెరువూరు నుంచి వాడపల్లి వరకు నాలుగు కిలోమీటర్లు, మడిచెర్ల నుంచి ఇమ్మిడివరం వరకు రోడ్డు, వంతెన నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంతో గిరిజనులకు పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యం ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి,వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, సచివాలయ మండల కన్వీనర్ పండా రామకృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజవొమ్మంగి మండలంలో పర్యటన

రాజవొమ్మంగి: ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ శనివారం మండలంలో పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. చెరకుంపాలెంలో కొత్త సచివాలయం, రైతు భరోసా భవనాలను ప్రారంభిస్తారు. దోనెలపాలెంలో దోనెలపాలెం నుంచి గొబ్బిలమడుగు ఘాట్ రోడ్డు పనులకు శంకుస్థాపన, వట్టిగెడ్డలో కొత్త సచివాలయం భవనం ప్రారంభం, రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయంలో 278 వైఎస్సార్ కానుక పింఛన్ల పంపిణీ, డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ, అప్పలరాజుపేటలో రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేటకు మంజూరైన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, లబ్బర్తి రోడ్ వద్ద డి. మల్లవరానికి వెళ్లే బీటీ రోడ్డుకు శంకుస్థాపన, ముంజవరప్పాడు గ్రామంలో లబ్బర్తి జంక్షన్ నుంచి కింద్రకాలనీకు వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు శంకుస్థాపన తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. కొయ్యూరు మండలం ఆడాకుల పంచాయతీ పరిధిలోని కించెలి, బి.కొత్తూరు, కన్నపేట, డి.కొత్తూరు, రామనగర్ గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 220 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పేద వాడి గుండె చోటు సంపాదించుకున్నారని చెప్పారు.

పీసీఎస్ మాజీ చైర్మన్ అప్పల గజ్జయ్యదొర, ఎంపీపీ బగుగు రమేష్, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, ఏఎంసీ చైర్మన్ జైతి రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, సచివాలయ కోఆర్డినేటర్ బండి సుధాకర్, జిల్లా ప్రచారకమిటీ సభ్యులు ధోని బాబ్జీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసలి నాయుడు, నాయకులు సత్యనారాయణ, అచ్చిరాజు, శ్రీను, శేఖర్, వనంబాబు, రెడ్డి నాయుడు, సావిత్రి, రామరాజ్యం, నానాజీ, రవి, కొండాజీ, రాజేశ్వరి, సర్పంచ్‌లు శోభన్, శ్రీను, కనపర్తి శ్రీను, కోటా శ్రీను, ఎంపీటీసీ మల్లేశ్వరి పాల్గొన్నారు.

తునికిచెరువులో ఫీవర్ సర్వే



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎటపాక: మండలంలోని పిచుకలపాడు సచివాలయం పరిధిలోని తునికి చెరువు గ్రామంలో శుక్రవారం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వేలో డాక్టర్ ప్రత్యూష్ జ్వరపీడితులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ సీతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

102 మందికి వైద్య సేవలు



వట్టివేగిసలో వైద్యశిబిరానికి హాజరైన రోగులు

జి.మాడుగుల: ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా వైద్యసిబ్బందిని, పీహెచ్‌సీలను సంప్రదించాలని డాక్టర్ రొబ్బా సొందొర తెలిపారు. మండలంలో సొలభం సచివాలయం-2 పరిధిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, 102 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కిల్లాడ సత్యనారాయణ, వైద్యసిబ్బంది ఎం.లక్ష్మీపతిరాజు, కె.శాంతమ్మ, లోచలి భాగ్యదిపిక పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లిరూరల్:ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జ్వరాల బారిన పడిన స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామరాజుపడాల్ తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సాంబశివరావు, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు



సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రవిశంకర్

పెదబయలు: మండలంలోని పర్రెడ పంచాయతీ పెద్దాపుట్టు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు జరిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెండా రవిశంకర్ ,హెచ్ఎం మత్స్యలింగం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించాలి

రంపచోడవరం: పిల్లల్లో ఆరోగ్య సమస్యలను గుర్తిస్తేనే వారిని ఆరోగ్యవంతులుగా చేసేందుకు అవకాశం ఉటుందని పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఇంద్రజ అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో రెండు రోజుల పాటు వైద్యులు, స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఎలా గుర్తించాలో వివరించారు. మెరుగైన వైద్య సేవలు కోసం రిఫర్ చేయాల్సి సెంటర్ల గురించి వివరించారు.సదస్సులో చింతూరు, రంపచోడవరం డివిజన్ పరిధిలోని వైద్యులు, స్టాఫ్ నర్సులు హాజరయ్యారు. ఇప్పటికే పాడేరు డివిజన్‌లో శిక్షణ ముగిసింది.ఏడీఎంహెచ్‌వోడాక్టర్ ప్రకాశం పాల్గొన్నారు.

మంగంపాడు ఆశ్రమ పాఠశాల సిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: మండలంలోని మంగపాడు ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు ఆ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం తయారుచేసిన ఆహారపదార్థాలను రుచి చూశారు. ఉడికీ ఉడకని అన్నం పెడుతున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండలేదన్నారు. ఈ మేరకు సంక్షేమ అధికారికి ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి, వెలుగూరి ప్రసాదరెడ్డి, సర్పంచ్ వేమ సంధ్యారాణి, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు,వైఎస్సార్‌సీపీ నాయకులు సుగ్గి శ్రీను, బాణం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



దివ్యాంగుడు దొంబుకు పింఛన్ అందజేస్తున్న ఎస్ఐ అప్పలసూరి



పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ శెట్టినీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు

అనంతగిరి: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని ఎంపీపీ శెట్టి నీలవేణి తెలిపారు. స్థానిక సచివాలయంలోని శుక్రవారం జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతుతో కలిసి ఆమె 13 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడారు.ఈ కార్యక్రమంలోని కార్యదర్శి బాలకృష్ణ, వెల్ఫేర్ రాజశేఖర్‌పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో పెదబరడ పంచాయతీ పరిధిలో కొత్త మంజూరైన 19 మందికి సర్పంచ్ సమిడి గోపాల్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కోసూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి పింఛన్ మంజూరు

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మారుమూల తోకచిలుక గ్రామంలో ఓ దివ్యాంగుడికి రూ. 3000 పింఛన్ మంజూరైనట్టు జీకేవీధి ఎస్ఐ అప్పల సూరి తెలిపారు. గ్రామానికిచెందిన దివ్యాంగుడు డొంబుకు ఎటువంటి పింఛన్ అందకపోవడంతో ఇటీవల ఆ గ్రామాన్ని సందర్శించిన ఎస్ఐ పింఛన్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ నెల నుంచి రూ.3000 పింఛన్ అందేలా చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు శాంతి,ఉప సర్పంచ్ రాజు, బీజేపీ జిల్లా నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ఇచ్చిన మాట ప్రకారం ఏటా పింఛన్ల సొమ్ము పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల హృదయాలను గెలుచుకున్నారని స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. రంపచోడవరం పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణతో కలిసి పంపిణీ చేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నబాబు, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి , ఈవోపీఆర్‌డీ జాన్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు .

జగనన్న సురక్ష విజయానికి సమష్టి కృషి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు

జి.మాడుగుల: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని విజయవంతానికి గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు తెలిపారు. మండలంలో భీరం సచివాలయం పరిధిలో గల సిబ్బందికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్య శిబిరం నిర్వహించిన రోజున అందరూ హాజరయ్యే విధంగా చూడాలని ఆయన ఆదేశించారు.

పోషకాహారం ప్రాధాన్యత గుర్తెరగాలి



పోషకాహార ప్రాధాన్యతపై మహిళలకు వివరిస్తున్న సీడీపీవో దీప్తి

అడ్డతీగల: మహిళలు పోషకాహార ప్రాధాన్యతను గుర్తెరగాలని అడ్డతీగల సీడీపీవో వి.దీప్తి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అడ్డతీగల మండలం తుంగమడుగులలో శుక్రవారం పోషకాహార అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు 2 ఏళ్ల వయస్సు వచ్చే వరకూ మధ్యకాలం వెయ్యి రోజులలో తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు గురించి వివరించారు. స్థానికంగా లభించే చిరు ధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ఇచ్చే అనుబంధ పోషకాహారాన్ని గర్భిణులు,బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూరగాయలతో చేసిన ఆహారపదార్థాల స్టాల్‌ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.తుంగమడుగుల సర్పంచ్ చెదల కృష్ణారెడ్డి,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.పావని,సచివాలయ కన్వీనర్ కోటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమోన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు



రాజవొమ్మంగి ఆశ్రమోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీలు

రాజవొమ్మంగి : స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల ప్రాంగణంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్ 14, 17 పోటీలకు శుక్రవారం మండల స్థాయి ఎంపికలు జరిగాయి. ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ పీడీలు సుజన, చిన్నారావుల పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీలు జరిగాయి. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు మూడు వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు

వై.రామవరం: మండలంలోని దారగడ్డ పంచాయతీ పూలోవ గ్రామంలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మారేడిమిల్లి ఐసీడీఎస్ సీడీపీవో ఎస్.ప్రసన్న తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి మారేడిమిల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 22 చివరి తేదీని అని తెలిపారు.

స్థానికంగా స్థిర నివాస ముండే 21 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల వివాహితలు అర్హులని తెలిపారు. ఎస్టీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.



ఉపాధి వేతనదారుల పిల్లలకు శిక్షణ



ఏపీవో రాంప్రసాద్

గూడెంకొత్తవీధి: ఉపాధిహామీ పథకంలోని వేతనదారుల పిల్లలకు శిక్షణఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిన్నట్టు ఏపీవో రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారంఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్ఆర్‌జీఎస్‌పథకంలో 100రోజుల పనిదినాలు పూర్తిచేసిన కుటుంబాల్లో యువతీయువకులకు వివిధ నైపుణ్యరంగాల్లో ఉచితశిక్షణ ఇచ్చి, ఉపాధిఅవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్నం,పెందుర్తి, గోపాలపట్నం,శీలానగర్,అనకాపల్లి శిక్షణ కేంద్రాల్లో వసతి,భోజనం కల్పిస్తూ మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరున్నవారికి గౌరవవేతనం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 21న జీకే వీధి ఉపాధి హామీ పథకం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రీడా పోటీలు విజయవంతం చేయాలి

చింతపల్లి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ప్రసాద్,బోడెంనాయుడు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.